క్లుప్తంగా

ఎంసెట్ కౌన్సెలింగ్‌కు 238 మంది హాజరు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధ్యాపకులు

నంగునూరు(సిద్దిపేట): ఇంజినీరింగ్ కళాశాలలో చేరేందుకు రాజగోపాల్‌పేట పాలిటెక్నిక్ కళాశాలలో ఎంసెట్ కౌన్సెలింగ్ కొనసాగుతోంది. రెండో రోజు 238 మంది విద్యార్థులు హాజరుకాగా అధికారులు సర్టిఫికెట్లు పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సూర్యనారాయణ, సారంగపాణి, నితిన్‌పవార్, శ్రీనివాస్, విజయ కుమార్, రాజమౌళి, జ్యోతి, కవిత పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

అక్కన్నపేట(హుస్నాబాద్): నెర్రెలు బారిన బీడు భూముల్లో గోదావరి జలాలను ముద్దాడించి మెతుకు సీమను బతుకు సీమగా మార్చిన ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌కు గురువారం ఎంపీపీ లక్ష్మి, జెడ్పీటీసీ భూక్య మంగల ఆధ్వర్యంలో నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సాంబరాజు, ఉపసర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మాలోతు నరసింహ నాయక్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ బస్సులను సద్వినియోగం చేసుకోండి

హుస్నాబాద్: జూలై 1న నిర్వహించే గ్రూప్–4 పరీక్షలు రాసే అభ్యర్థుల కోసం హుస్నాబాద్ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ వెంకటేశ్వర్ గురువారం తెలిపారు. పట్టణంలోని 8 సెంటర్లలో 2154 అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. అభ్యర్థుల కోసం ఉదయం నుంచి నడిచే రెగ్యులర్ బస్సులతో పాటు కరీంనగర్ నుంచి హుస్నాబాద్‌కు 4 ప్రత్యేక బస్సులు, హుజూరాబాద్ నుంచి హుస్నాబాద్‌కు 2 ప్రత్యేక బస్సులు, జనగామ నుంచి హుస్నాబాద్‌కు ఉదయం 7 గంటలకు, ఒకటి నైట్ అవుట్ బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను వినియోగించుకోవాలని డీఎం కోరారు.

గ్రూప్–4 అభ్యర్థులకు ప్రత్యేక బస్సులు

గజ్వేల్‌రూరల్: గ్రూప్–4 అభ్యర్థుల కోసం జీపీపీ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ సురేఖ పేర్కొన్నారు. గురువారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. గజ్వేల్ బస్టాండ్ నుంచి జూలై 1న ఉదయం 4 గంటల నుంచి సంగారెడ్డికి, 5 గంటల నుంచి జేబీఎస్‌కు, 6 గంటల నుంచి సిద్దిపేట మార్గంలో ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా గజ్వేల్ పట్టణంలో ఉన్న బాలికల, బాలుర హబ్‌లలో అభ్యర్థుల కోసం ప్రజ్ఞాపూర్ చౌరస్తా నుంచి బస్సులు నడుస్తాయని పేర్కొన్నారు. గజ్వేల్‌తో పాటు ప్రజ్ఞాపూర్‌లోని బస్టాప్‌ల వద్ద హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశామని, సిబ్బంది అందుబాటులో ఉండనున్నట్లు తెలిపారు.

ఎల్‌ఓసీ అందజేత

కొండపాక(గజ్వేల్): మండల కేంద్రానికి చెందిన మారబోయిన లక్ష్మి వైద్యఖర్చుల నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ పథకంలో మంజూరైన రూ.2.50లక్షల ఎల్‌ఓసీని గురువారం జాగృతీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు అనంతుల ప్రశాంత్ బాధిత కుటుంబానికి అందజేశారు. లక్ష్మి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఎల్‌ఓసీ మంజూరుపై సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, ఎంపీ ప్రభాకర్‌రెడ్డిలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

అసత్య ప్రచారాలు చేయడం సరికాదు

గజ్వేల్‌రూరల్: సెలవుల్లో ఉన్న ప్రధానోపాధ్యాయురాలు పాఠశాలకు రావడం లేదంటూ అసత్య ప్రచారాలు చేయడం సరికాదని గురువారం ఒక ప్రకటనలో ఎంఈవో సునీత పేర్కొన్నారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని సంగాపూర్‌లోగల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఈనెల 21 నుంచి తన అనుమతితో పాటు స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శోభ వద్ద సైతం అనుమతి పొందిన తర్వాతే చైల్డ్ కేర్ లీవ్ తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయంలో డీబీఎఫ్ నాయకులు వేణు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శేఖర్‌లు మండల స్థాయి విద్యాశాఖ అధికారులను సంప్రదించకుండా ప్రకటన చేయడంతో సెలవుల్లో ఉన్న ప్రధానోపాధ్యాయురాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై ప్రశ్నించే అవకాశమున్నా సంబంధిత అధికారి వివరణ తీసుకోకుండా తప్పుడు ప్రచారాలు చేయడం మానుకోవాలని సూచించారు.



హుస్నాబాద్: ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



చిన్నకోడూర్‌లో..

ఘనంగా బక్రీద్

అల్లాహ్ ఔన్నత్యాన్ని, ఆయన ఘనతను కీర్తించే గొప్ప పర్వదినం బక్రీద్ త్యాగానికి ప్రతీకగా నిలుస్తోంది. పండగ సందర్భంగా గురువారం జిల్లా వ్యాప్తంగా ఈద్గాలు, మసీద్‌ల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు అలాయ్ బలాయ్ తీసుకుంటూ బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు ముస్లింలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు.

గజ్వేల్: గజ్వేల్‌లో ముస్లింలకు రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డిలు శుభాకాంక్షలు తెలిపారు.



గజ్వేల్‌లో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



చేర్యాల(సిద్దిపేట): కాశగుడిసెలులో..



కొమురవెల్లి(సిద్దిపేట): అయినాపూర్‌లో..



మిరుదొడ్డి(దుబ్బాక): అల్వాలలో శుభాకాంక్షలు తెలుపుతున్న కో-ఆప్షన్ మెంబర్ అహ్మద్



దుబ్బాక: జామ మసీద్‌లో ప్రార్థనలకు హాజరైన ముస్లింలు



గజ్వేల్: శుభాకాంక్షలు తెలుపుతున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి



మద్దూరు(హుస్నాబాద్): లద్నూరులో..

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించండి



అంజిరెడ్డితో వట్టిపల్లి నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని అలిరాజ్‌పేట గ్రామానికి డబుల్ ఇళ్లు, ఎస్సీ, బీసీ కమ్యూనిటీ భవనాలు మంజూరు చేయాలని కోరుతూ గురువారం ఎంపీటీసీ రమ్యరవి, బీఆర్‌ఎస్ నాయకులు డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రంగారెడ్డిలను కలిసి వినతిపత్రం అందించారు. అదేవిధంగా వట్టిపల్లి గ్రామంలో ఇళ్ల మధ్య నుంచి డబుల్ రోడ్డు వెడల్పునకు నిధులు మంజూరు కావడంతో రోడ్డు నిర్మాణంలో ఇల్లు కోల్పోయే బాధితులకు గృహలక్ష్మి కేటాయించాలని కోరుతూ గ్రామ నాయకులు యశ్వంత్‌రెడ్డి, సత్యనారాయణ, కనకయ్య, ఎల్లయ్యలు అంజిరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు సానుకూలంగా స్పందిస్తూ సమస్యలను మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, సత్తిరెడ్డి, శేఖర్, శేఖర్‌రెడ్డి, అశోక్‌గౌడ్, వెంకట్ పాల్గొన్నారు.

రాజకీయ పబ్బం గడపడానికే విమర్శలు



మాట్లాడుతున్న నర్సింగరావు తదితరులు

కొమురవెల్లి(సిద్దిపేట): బీఆర్‌ఎస్ నాయకులు రాజకీయ పబ్బం గడపడానికే మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ నాయకులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు వల్లాద్రి అంజిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బుధవారం కొంతమంది బీఆర్‌ఎస్ నాయకులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై చేసిన విమర్శలను ఖండించారు. బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మెప్పు పొందడానికే కొమ్మూరిపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. కొమ్మూరికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక చిల్లర మాటలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జంగని రవి, కేశిరెడ్డి మల్లారెడ్డి, మల్లంశేఖర్, పోతుగంటి రవి, మేడికుంట శ్రీను, గొల్లపల్లిశ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టని బీఆర్‌ఎస్

చేర్యాల(సిద్దిపేట): ప్రజా సమస్యలు పట్టని బీఆర్‌ఎస్ నాయకులకు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని విమర్శించే స్థాయి లేదని మాజీ జెడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. పోలీసులను అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడుతూ, అడ్డొచ్చిన వారిపై అక్రమ కేసులు పెట్టించే బీఆర్‌ఎస్ నాయకులు ప్రతాప్‌రెడ్డిని విమర్శించడం సిగ్గుచేటన్నారు. ప్రతాప్‌రెడ్డిపై విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో నాయకులు బాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మల్లేశం, శ్రీకాంత్, చెన్నయ్య పాల్గొన్నారు.

చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి

మద్దూరు(హుస్నాబాద్): చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా వెంటనే ప్రకటించాలని చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ కన్వీనర్ రామగళ్ళ పరమేశ్వర్ అన్నారు. గురువారం మద్దూరు మండల కేంద్రంలో జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి ఆలేటి యాదగిరితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చేర్యాల ప్రాంత ప్రజలు ఎంతో పోరాటం చేశారన్నారు. రెవెన్యూ డివిజన్ సాధించేందుకు గ్రామ గ్రామాన ప్రజలను ఏకం చేయాలని వారు కోరారు. ఓటు మీకు డివిజన్ మాకు అనే నినాదంతో ముందుకు సాగాలని అప్పుడే రెవెన్యూ డివిజన్ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఇమ్మడి ఆగంరెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, మాజీ సర్పంచ్‌లు బాలరాజు, మేక మల్లేశం, జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి

అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ కీర్తన

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని మర్రిముచ్చాల గ్రామంలో మండల పరిషత్ నిధుల నుంచి రూ.1.6లక్షలతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ పనులను ఎంపీపీ తలారి కీర్తన గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో నర్సింగరావు, యాదయ్య, కిషన్, వంశీ, ప్రదీప్, రవీందర్, గాలయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



ఆశ్రమంలో పూజలు చేస్తున్న ప్రతాప్‌రెడ్డి

మర్కూక్(గజ్వేల్): ఎంతో మహిమగల ఆలయం రుక్మిణీ పాండురంగస్వామి కొలువైన ఆలయం భవానందపురం ఆశ్రమం అని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. 92వ ఆషాఢి ఉత్సవాల్లో భాగంగా ఆశ్రమంలో గురువారం స్వామివారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ పండరీపురం పాండురంగ ఆశ్రమమని తెలిపారు. ఆలయానికి ఎంతో చరిత్ర ఉందని వివరించారు. సీఎం కేసీఆర్ ఆలయాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. మూడు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని ఆలయ పండితులు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మంగమ్మరాంచంద్రం, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ, నాయకులు లింగం, రవీందర్, పురోహితులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఆర్థికసాయం**

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండలంలోని బైరాన్‌పల్లి గ్రామానికి చెందిన నందబోయిన కలవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బీఆర్‌ఎస్ రాష్ట్ర నాగపురి కిరణ్‌కుమార్‌గౌడ్ బాధిత కుటుంబానికి గురువారం పరామర్శించి, రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఉమేశ్, నర్సింలు, శ్రీనివాస్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

◆ **సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరం**

చేర్యాల(సిద్దిపేట): సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరం వంటిదని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని రాంపూర్‌కు చెందిన జగ్గయ్యకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.60వేల చెక్కును బాధితుడికి కిరణ్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రంగు శివశంకర్, ఎస్‌ఎంసీ చైర్మన్ అంజయ్య, వార్డుసభ్యులు సుభాష్, కిష్టయ్య, మల్లయ్య, జయమ్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ **ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి**

గజ్వేల్‌రూరల్: ఆర్టీసీ అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని విలేజ్ బస్ ఆఫీసర్లు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని జాలిగామ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విలేజ్ బస్ ఆఫీసర్ జయేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆర్టీసీ ద్వారా రాయితీపై బస్‌పాస్‌లను అందించడంతో పాటు శుభకార్యాలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను వారి వద్దకే వెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మహిళలకు, వృద్ధులకు ఆర్టీసీ ద్వారా అందిస్తున్న వివిధ రకాల సేవలపై వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ శివయ్య, ఎంపీటీసీ రాజిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ **పరామర్శ**

గజ్వేల్‌రూరల్: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన కాంగ్రెస్ నాయకుడు ఆకుల వెంకటేశంను డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పరామర్శించారు. గురువారం గజ్వేల్‌లోని ఆకుల వెంకటేశం ఇంటికి వెళ్లి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా ఉండాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి, కాంగ్రెస్ నాయకులు శివారెడ్డి, మల్లారెడ్డి, నక్క రాములుగౌడ్ తదితరులున్నారు.

◆ **కొనసాగుతున్న భూనిర్వాసితుల దీక్ష**

వర్గల్(గజ్వేల్): ఫుడ్‌ప్రాసెసింగ్ పరిశ్రమల కోసం సేకరించిన భూమికి చట్టబద్ధమైన పరిహారం అందించాలనే డిమాండ్‌తో వర్గల్ మండలం అవుసులోనిపల్లిలో భూనిర్వాసితుల దీక్ష గురువారం ఏడో రోజుకు చేరింది. మాజీ ఎంపీటీసీ యాదయ్య ఆధ్వర్యంలో పండగ రోజు సైతం భూనిర్వాసిత రైతులు దీక్షను కొనసాగించారు. గోవర్ధన్‌రెడ్డి, యాదగిరి, గోపయ్య తదితరులు దీక్షలో కూర్చున్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం




కరపత్రాలు పంచుతున్న నాయకులు

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని తిప్పారం గ్రామంలో కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం చేపట్టిన పథకాలపై బీజేపీ మండల అధ్యక్షుడు మన్నెం శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పాలనను ప్రపంచ దేశాలు అభినందిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో కుటుంబ పాలన సాగుతోందన్నారు. కార్యక్రమంలో గ్రామ శక్తి కేంద్ర ఇన్‌చార్జి కోరె సంతోష్, బూత్ అధ్యక్షుడు ఈసాల నవీన్, నాయకులు చేకూటి అనూష్, దేవరాజ్, నవీన్‌కుమార్, గడ్డం మల్లేశం, శ్రీరాములు, వంశీ, కనకరాజు, శ్రీనివాస్, రుద్రారం రాజు, సాయిగౌడ్, నవీన్, చిలుముల చందు, గుర్జకుంట శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వర్గల్(గజ్వేల్): మండలంలోని మజీద్‌పల్లిలో బీజేపీ స్వల్పకాలిక విస్తారక్ ఆనందన్, మండల అధ్యక్షుడు శ్రీరాంశ్రీకాంత్ పర్యటించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌యాదవ్, పాండు, రవీందర్‌గౌడ్, మహేశ్‌యాదవ్, కృష్ణగౌడ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

వృథాగా మిషన్ భగీరథ నీరు



ట్యాంక్ నిండి వృథాగా పోతున్న నీరు

చేర్యాల(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికీ శుద్ధమైన తాగునీరు అందించాలన్న లక్ష్యంతో చేపట్టిన మిషన్ భగీరథ అధికారుల అలసత్వం, కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంతో అభాసుపాలవుతోంది. ఇందుకు నిదర్శనం ఈ ఫొటోలోని ఓవర్ హెడ్ ట్యాంక్. పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్, ఎంపీడీఓ కార్యాలయాల సమీపంలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్ గురువారం ఉదయం నిండి నీరు గంటల తరబడి వృథాగా పోతున్నా పట్టించుకున్న నాథుడే లేడు. ఇది ఇలా ఉంటే కొన్ని గ్రామాలు, కాలనీల్లో సరిపడా నీరు రావడం లేదన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకొని నీటి వృథాను కట్టడి చేసి అందరికీ సరిపడా నీరు అందించాలని కోరుతున్నారు.

ఇసుక తరలింపు ఎటు!

పట్టుకున్న ఇసుక డంప్‌పై అనుమానాలు



గాగిల్లాపూర్ శివారులో అధికారులు వదిలేసిన ఇసుక

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గాగిల్లాపూర్ శివారులో పట్టుకున్న ఇసుక డంప్‌లలో మిగిలిన ఇసుక తరలింపుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బెజ్జంకి తహసీల్దార్ విజయ ప్రకాశ్‌రావు ఆదేశాల మేరకు బుధవారం ఎస్‌ఐ ప్రవీణ్‌రాజ్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది ఆకస్మిక తనిఖీ చేసి గాగిల్లాపూర్ శివారులో మూడు అక్రమ ఇసుక డంప్‌లను గుర్తించిన విషయం పాఠకులకు విధితమే. అయితే పట్టుకున్న ఇసుకను బెజ్జంకి తహసీల్దార్ కార్యాలయానికి తరలిస్తున్నామని తెలిపారు. కాగా రెండు డంపుల ఇసుకను మాత్రమే తహసీల్దార్ కార్యాలయానికి తరలించగా మరోచోట ఉన్న డంప్‌లోని ఇసుకపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



దుబ్బాక వేంకటేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు దంపతులు



చేర్యాల(సిద్దిపేట): వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

దుబ్బాకటౌన్: పంటలు బాగా పండి రైతులు, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. గురువారం ఆషాఢ మాసం తొలిఏకాదశి పర్వదినం పురస్కరించుకొని ఎమ్మెల్యే దంపతులు దుబ్బాక పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నానన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోండి

18 సంవత్సరాలు నిండి డ్రైవింగ్ లైసెన్స్ లేని యువతీ, యువకులు దుబ్బాక పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నేటి నుంచి జులై 5 లోగా ఆధార్‌కార్డు, పాస్‌ఫొటోలు, టెన్త్ క్లాస్ మెమో లేదా బర్త్ సర్టిఫికెట్ ఇచ్చి తమపేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. లైసెన్స్ ఫీజు తన కార్యాలయం నుంచే చెల్లించి సిద్దిపేట ఆర్టీవో కార్యాలయం నుంచి లైసెన్స్‌లు ఇప్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని దుబ్బాక నియోజకవర్గంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట–భూంపల్లి మండలం కూడవెల్లి రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే రఘునందన్‌రావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు సంకేత్‌శర్మ ఎమ్మెల్యే దంపతులను శాలువాతో సన్మానించారు.

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భం ప్రధాన అర్చకుడు శేషాచార్యులు, అర్చకుడు రాజు స్వామి మాట్లాడుతూ.. శ్రీమన్నారాయణుడు యోగ నిద్రలోకి వెళ్లి చాతుర్మాస్య దీక్ష ఆరంభించే పరమ పవిత్ర పర్వదినమే తొలి ఏకాదశి అన్నారు. ఈ సందర్భంగా ఆలయం విష్ణు సహస్రనామ పారాయణం, భగవన్నామస్మరణతో మార్మోగింది.

సాయిచంద్ మరణం తీరనిలోటు



మిరుదొడ్డిలో సాయిచంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు



సిద్దిపేటజోన్: నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

సిద్దిపేటజోన్: తెలంగాణ ఉద్యమకారుడు, గాయకుడు సాయిచంద్ భౌతికంగా లేకున్నా, పాడిన పాటల రూపంలో ఆయన సజీవంగా ఉంటాడని బీఆర్‌ఎస్ నాయకులు కొనియాడారు. గురువారం మంత్రి హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంలో సాయిచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, లక్ష్మణ్, కౌన్సిలర్లు తిరుమల్‌రెడ్డి, మల్లికార్జున్, ఆనంద్, ఎల్లం, రఘురాం, యోగి, రాజు, శ్రీహరి, మంత్రి వ్యక్తిగత పీఏ శేషు పాల్గొన్నారు.

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి మండలంతో పాటు, అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు గురువారం సాయిచంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ గజ్జెల సాయిలు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, పూర్వ జిల్లా తెలంగాణ ఉద్యమ జేఏసీ సభ్యుడు పెద్దిరాజు, సర్పంచ్‌లు రాములు, సత్యనారాయణ, ఎంపీటీసీలు నర్సింలు, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

దుబ్బాకటౌన్: దుబ్బాక పట్టణంలో సాంస్కృతిక సారథి కళాకారులు సాయిచంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాకారులు ఎల్లం, నర్సింలు, ఆస రామారావు, ఎల్లం, దేవదాసు, మల్లికార్జున్ ఉన్నారు.

సిద్దిపేటకమాన్: సాయిచంద్ మరణంపై గురువారం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో డీడబ్ల్యూజేఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రాజలింగం ఆధ్వర్యంలో సంతాపం వ్యక్తం చేసి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనార్ధన్, ఉపాధ్యక్షుడు దేవికిరణ్, ప్రభుదాస్, కోశాధికారి దాసరి చంద్రం, సలహాదారులు ప్రకాశ్, బాబురావు, చందు పాల్గొన్నారు.

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సాయిచంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు శ్రీనివాస్, కుమార్, ఏగొండస్వామి, స్వామి, యాదగిరి, కృపానందం, శ్రీనివాస్, స్వామి, వేణు, వినోద్, నరేశ్ పాల్గొన్నారు.

హుస్నాబాద్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సాహిత్య సాంస్కృతిక సారధి వ్యవస్థాపక అధ్యక్షుడు ముక్కెర సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు సాయిచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాకారులు శ్రీనివాసులు, బాలయ్య, బాలు, శ్రీకాంత్, వినోద్ కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.